1977 పింగళ సంవత్సర దీపావళి కథల పోటీలో రు. 116/- కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

# దమయంతి • కళ్లెర్రబడ్డాయి

రాత్రి పన్నెండెప్పుడో దాటింది. సముద్రపు హోరు చెవులు చిల్లులు పడేలా వినవస్తోంది. బయట సన్నగా చినుకులు పడుతున్నాయి.

నిద్రపట్టక మంచంపైన అటూ, ఇటూ కదులుతున్నాడు కాళిదాసు. అతనిలో ఆలోచనలు పదును తేలుతున్నాయి. మనసు వేడెక్కుతోంది. లేచి మంచంపైన కూర్చుని సిగరెట్ వెలిగించాడు.

రూమ్మేట్ సక్సేనా నిద్రపోతున్నాడు.

తలుపులు తెరుచుకుని వరండాలో కొచ్చాడు కాళిదాసు. హోటలు గాఢనిద్రలో వుంది. చలిగాలి రివ్వున వీస్తూ ఒక్కసారిగా కాళిదాసు పైన దాడిచేసింది. పిట్టగోడ మీదచేతులు ఆనించి వంగి నిలుచున్నాడు కాళిదాసు.

నల్లని మబ్బులు ఆకాశాన్ని పీడిస్తున్నాయి. బలంగా వీస్తున్న గాలి చెట్లని అల్లాడిస్తోంది. ఈ ప్రపంచాన్ని కబళించాలన్న కోరిక తీరకన్నట్టు సముద్రం భోరుమని ఏడుస్తోంది. నల్లని చీకటి పాపంలా చిక్కగా రాక్షసిలా వుంది. కష్టంలో వున్న మనిషి మనసు చిక్కిపోయేలా కీచురాళ్ళ మోత.

కాళిదాసు కళ్ళ ముందు కృష్ణజ్యోతి రూపం మెరుపులా మెరిసింది. ఓ అరక్షణం కళ్ళు మూసుకొన్నాడు కాళిదాసు.

చినుకులు పెద్దవై వానగా మారింది. సముద్రం పైన తటిల్లిన మెరుపు మెరిసింది. దాని వెనకే గుండె లవిసేలా భయంకరమైన పిడుగు గర్జన వినిపించింది. కాళిదాసు చేతిలో సిగరెట్ ఆఖరి దశని చేరుకొంది. దాన్ని అవతల విసిరేసి గదిలో కొచ్చి తలుపులు మూశాడు.

కాళిదాసుకి ఏడుపొచ్చింది.

మగవాడు ఈ ప్రపంచం మునిగిపోతున్నా చూసి ఓర్చుకోవాలేగానీ, ఏడవకూడదని కాళిదాసుకు తెలుసు.

కానీ తన దురదృష్టానికి ఓర్పుని పోగొట్టుకున్నాడు.

కృష్ణజ్యోతి అతని గుండెల్లో మహారాణీ స్థానాన్ని ఆక్రమించింది. ఆ సంగతి అతనికి మాత్రమే తెలుసు.

కృష్ణతో కాళిదాసెప్పుడూ మాట్లాడలేదు. అసలు మాట్లాడే అవకాశమే చిక్కలేదు. అవకాశం వచ్చినా తను ఆమెతో మాట్లాడగలడా? చూసినవాళ్ళు నవ్విపోరా?

అతని పెదవుల మధ్య మరో సిగరెట్ వెలిగింది. దానితోపాటే అతని పెదవులపైనా నిరాశతో కూడిన నవ్వు వెలిగింది.

కృష్ణ రూపం కళ్ళముందు కారట్లాడుతోంటే, కృష్ణ ఆలోచనలు మనసుని తింటుంటే అతనికి తోచకుండా ఉంది. ఏమి చెయ్యడానికీ మనసొప్పడం లేదు. తిండి తినాలని లేదు. చదువుపైన ఆసక్తి లేదు. నీట్‌గా డ్రెస్ చేసుకోవాలన్న తలంపే లేదు. క్లాసులకి హాజరై పాఠాలు వినాలన్న ధ్యాసలేదు. గడ్డం మాసిపోయి, సిగరెట్లు కాల్చి కాల్చి పెదాలు నల్లబడిపోయి ఆర్నెల్లు టైఫాయిడ్ పడ్డ రోగిలా ఉన్నాడు కాళిదాసు.

అద్దం ముందు నుంచున్నాడు దాసు.

నల్లని మొహం, కొనతేరిన ముక్కు, చిన్న కళ్ళు, పల్చని చెంపలు, పత్తైన కనురెప్పలు, పెద్దనోరు. నల్లని పెదాలు. దళసరి మీసకట్టు, గడ్డం, చిన్నప్పుడెప్పుడో తగిలిన దెబ్బకి గుర్తుగా కుడి కంటి రెప్పపైన మచ్చ.. జీబిరి జుత్తు. సన్నని ఆకారం.... తనెలా వుండేదీ కళ్ళకి కొట్టొచ్చినట్టు కనబడేసరికి ఉద్రేకంతో వణికిపోయాడు కాళిదాసు.

తనేం పాపం చేశాడనిలాంటి రూపాన్నిచ్చాడు దేవుడు? దేవుడు కనబడితే హత్య చెయ్యాలన్నంత కసిగావుంది కాళిదాసుకి. తన జన్మకి కారణమైన తల్లి తండ్రిమీద జుగుప్సతో కూడిన భావం.... కేవలం వాళ్ళ ఆనందం కోసం గడిపిన కొన్ని క్షణాల ఫలితమే తను. అదే జరక్కపోతే తనీరోజునిలా ఏడవ్వల్సి వచ్చేది కాదు.

కృష్ణ తన పక్కన నించోగలదా? కృష్ణ సహించినా చూసేవాళ్ళే మంటారు.

సూట్‌కేస్‌లోంచి విస్కీ సీసా తీసి నీట్‌గా తాగేశాడు.

గొంతు కాలిపోతున్నట్లుగా ఉంది. ఊపిరి తిత్తుల్లోంచి వేడి వడగాలిలా శరీరమంతా విజృంభిస్తోంది. కాళిదాసుకి వళ్ళు తూలుతోంది.

"కృష్ణా, నువ్వు నా క్కావాలి. నువ్వు లేకపోతే నేను బతకలేను!"

కాళిదాసు నేలపైకి జారిపోయాడు. అతని వంటిపైన స్పృహ లేకపోయినా దేనికోసమో అతను పడే ఆవేదనకి చిహ్నంగా అతని కంఠం అదురుతోంది.

## 2

'సన్ అండ్ సీ'లో కాఫీ తాగి బయటకొచ్చాడు కాళిదాసు. సిగరెట్ వెలిగించి బీచిలో అడుగు పెట్టాడు.

ఇసుకలో కూర్చుని సముద్రం కేసి చూస్తున్నాడు. చీకటిపడ్డానికింకా అట్టే సమయంలేదు. బీచిలో జనంకూడా అట్టే లేరు. కాళిదాసు నీరసంగా లేచి సముద్రం దగ్గరగా నడిచాడు. కెరటాలు అతని పాదాల్ని తడిపి వెనక్కి పోతున్నాయి.

కాళిదాసు ఆలోచనలకి అవరోధం కలిగింది. దూరంగా కృష్ణ-కృష్ణతో పాటు ఇంకో....మనిషి!

మహారాణీ హాస్టల్ టెర్రేస్‌పైన ఆడపిల్లలు కనబడుతున్నారు.

కృష్ణకోసం అతనెవరో హాస్టల్ కెళ్ళి వుండాలి. అతనితో పాటుగా కృష్ణ బీచి కొచ్చి వుండాలి.

"ఎవరతను?"

కృష్ణా, అతనూ ఒకరి చెయ్యి మరొకరు పట్టుకొని నడుస్తున్నారు.

కాళిదాసుకి రోమాలు నిక్కబొడుచుకున్నాయి. తన కళ్ళముందు కృష్ణ చేయి పట్టుకొని నడుస్తున్న అతనెవరు? గాలికి చెదిరి మొహంపైబడ్డ జుత్తుని చేత్తో విసురుగా వెనక్కి తోసుకున్నాడు.

కృష్ణ, అతను పక్కపక్కగా కూర్చున్నారు. ఒక పొద పక్కగా కూర్చుని వాళ్ళని చూస్తున్నాడు కాళిదాసు.

అతను నవ్వుతూ ఏదో చెబుతున్నాడు. కృష్ణ నవ్వుతోంది. ఇసకలో పిచ్చికగూళ్ళు కడుతూ అతనికేసిచూసి నవ్వుతోంది. కాళిదాసుకి గుండెల్లో చెయ్యిపెట్టి దేవినట్టయింది. తను ప్రేమిస్తున్న కృష్ణని మరో మనిషి పక్కన- ఊహించడానికే కష్టంగా వుంది కాళిదాసుకి.

కృష్ణ అతన్నిగానీ ప్రేమిస్తోందా?

(అవును ప్రేమిస్తోంది)

"నీకెలా తెలుసు?"

(ప్రేమించని మనిషి చెయ్యి ఎందుకు కలుపుతుంది?) చెయ్యి పట్టుకున్నంత మాత్రంచేత ప్రేమించినట్టేనా?

(అవును)

"నీవు ప్రేమించిన మనిషి నీ కళ్ళెదుటే ఇంకో మనిషితో అంత చనువుగా వుంటే భరించగలవా?"

(లేదు-చంపేస్తాను)

"అయితే ఆ పనేదో కానియ్"

కాళిదాసు పళ్ళు పట పట కొరికాడు. చీకటి బాగా ముదిరిపోయింది. కృష్ణ అతని ఒడిలో ఉంది. అతను తలవంచి ఆమె మొహంలో మొహంపెట్టి చూస్తున్నాడు.

"చూస్తున్నావా వాడేం చేస్తున్నాడో?"

(చూస్తున్నాను బహుశా వాడు కృష్ణని ముద్దు పెట్టుకొంటున్నాడు.)

"మరి చూస్తూ ఊరుకొంటావే? వాడు కృష్ణపైన పూర్తిగా దాడిచేయక ముందే నీ జేబులో చాకుగాని ఉంటే వాడి పీక కోసెయ్-లేకపోతే ఏ కర్రతోనో వాడి బుర్ర పగలగొట్టు."

కాళిదాసు కదల్లేదు. చూస్తున్నాడు. కళ్ళకక్కనిపించే ఆ దృశ్యం అతని ఒంట్లో వేడిని పెంచుతోంది. తనలో వస్తోన్న మార్పుని కాళిదాసు గమనించాడు. చెమట్లు పడుతున్నాయి. శరీరంలో సన్నగా వణుకు ప్రారంభమయింది. విడుస్తోన్న ఊపిరి వెచ్చగా తగుల్తోంది. మరి కొంతసేప లాగే ఉంటే నరాలు చిట్లిపోతాయేమో అన్నంత భయంగా ఉంది కాళిదాసుకి.

కృష్ణని చుట్టేశాడతను. కృష్ణ అభ్యంతరం చెప్పడంలేదు. నవ్వుతోంది. బీచిలో పబ్లిగ్గా (జనంలేరు అది వేరే సంగతి) కృష్ణ అతనితో అలా ఛీ....ఛీ.

కృష్ణ తనకి దగ్గరగా ఉండాలి. తన బాహువుల్లో ఒదిగిపోవాలి. ఆ వెచ్చదనం తన కొక్కడికే కావాలి. కృష్ణని పీల్చి పీల్చి తాగెయ్యాలి. కాళిదాసులో కోరిక కాలిపోతోంది.

వాళ్ళు లేచి నుంచున్నారు. ఒంటికంటిన ఇసుకని దులిపేసుకొన్నారు. కృష్ణ నడుస్తోంది. ఆమె భుజం చుట్టూ చేతులువేసి నడిపిస్తున్నాడతను.

కాళిదాసు నుంచున్నాడు. వెనగ్గా ఓ పది గజాల దూరంలో నడుస్తున్నారు.

"ఒక మగాడితో తెగింపుగా ఒక ఆడపిల్ల రోడ్డుమీద అలా నడవడాన్ని ఏమంటారు?"





సొంత వూరు మానికొండ (కృష్ణాజిల్లా). నాన్నగారు శ్రీ ఎం. వి. రావు, అమ్మగారు శ్రీమతి రంగనాయకమ్మ. నాన్నగారి ఉద్యోగ రీత్యా ఇరవై సంవత్సరాలుగా హైదరాబాదులో ఉంటున్నాము. పుట్టింది ఇరవై సంవత్సరాలనాడు ఆగస్టు 21 న.

బి. కాం. పాసైన తర్వాత కొంతకాలం ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో ఎనౌన్సర్ గా పని చేశాను. ప్రస్తుతం బ్యాంక్ లో ఉద్యోగం. ఇదివరలో కొన్ని కథలు పత్రికల్లో ప్రచురితమైనాయి. కొన్ని నాటికలు, కథానికలు రేడియోలో ప్రసారమయినాయి. రకరకాల వ్యాసంగంవల్ల చదువు పాడైపోతుందని, అమ్మగారి మందలింపు చేత కలం పట్టే అవకాశం నాకు చాలా తక్కువ. కానీ ఈ మధ్య రాయాలనే ఓ తపన నా చేత రచన చేయిస్తోంది. ఓ పదిహేను కథల వరకూ ప్రముఖ వారపత్రికల్లోనూ, మాసపత్రికల్లోనూ ప్రచురణకి స్వీకరింపబడి వెలుగులోకి రాబోతున్నాయి. ఇటీవల ప్రారంభించిన ఒక సచిత్ర వారపత్రికలో ప్రముఖ రచయితలతో కలిసి రాసిన గొలుసు నవలిక రాబోతోంది.

ఫార్ములా కథలు కాకుండా, వైవిధ్యం గల కథలు కొత్త తరహాలో రాయాలనే అభిప్రాయం.

కళ్ళే రబడ్డాయి. కథకి కన్సొలేషన్ బహుమతి నిచ్చిన ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రిక సంపాదక వర్గానికి నా కృతజ్ఞతలు.

—దమయంతి

(ప్రేమ)

"మరి నీ సంగతేవిటి?"

(నువ్వు తనంటే పడిచస్తున్నావని ఆమెకి తెలీదు)

"మరెందుకు చెప్పలేదు?"

(కాంప్లెక్స్)

"అలాంటప్పుడు వాళ్ళని చూసి ఏడవడం ఎందుకు?"

(ఏడుపు కాదు కసి. నా దనుకొన్న వస్తువు నాకు దూరం అయితే సహించలేను.)

"అయితే నువ్వేం చేస్తావో చూడాలి!"

(చూడు)

కృష్ణని హాస్టలు వరకూ దిగబెట్టాడతను. తర్వాత వెనక్కి తిరిగాడు.

బీచిరోడ్డు పట్టాడు. కాళిదాసు అతని పక్కగా నడిచాడు.

"మిస్టర్ ఏ ఊరు నీది?"

అతను కాళిదాసుని ఎగాదిగా చూశాడు. కాళిదాసు అతన్ని గమనించాడు. అందగాడే. తను కురూపినన్న విషయం, ఎదుటివాడు అందగాడు అన్న నిజాన్ని గ్రహించగానే నిలువెల్లా వణికిపోయాడు.

"నిన్నే అడిగింది."

"బందరు."

"ఆ అమ్మాయి నీకెలా తెలుసు?"

"మా ఊళ్ళో కలిసి చదువుకొన్నాం"

"ప్రేమించుకున్నారా?"

"లేదు!"

"మరి?"

"మేం స్నేహితులం."

"స్నేహితులైతే ఆ పిచ్చి పనులేమిటి?"

"నువ్వెవరు? నీకు సంజాయిషీ ఎందుకివ్వాలి?"

కాళిదాసు అతన్ని పరీక్షగా చూశాడు. తనకంటె బలంగా వున్నాడు. తను అతన్ని కొట్టలేడు.

"సరే వెళ్ళు."

అతను కదిలాడు.

కాళిదాసు సిగరెట్ వెలిగించాడు. అతని కళ్ళు మెరిశాయి. రోడ్డు పక్కగా పడివున్న ఇనుప కమ్మిని చేతిలోకి తీసుకొన్నాడు. వెనగ్గా వెళ్ళి అతని తలమీద బలంగా కొట్టాడు.

"అమ్మా!" అని అరుస్తూ అతను నేల వాలిపోయాడు.

## 3

కాళిదాసు గత కొన్ని రోజులుగా కృష్ణని జాగ్రత్తగా గమనిస్తున్నాడు. వారం రోజుల క్రితం కృష్ణని జగదాంబా టాకీస్ లో చూశాడు. కృష్ణ ఒక్కతే రాలేదు. స్నేహితురాలితో రాలేదు. కాళిదాసుకి తెలియని ఎవరో కొత్త వ్యక్తితో కలిసి సినిమా కొచ్చింది! వెనక రోలో కూర్చుని కృష్ణనీ, అతన్నీ మార్చి మార్చి చూశాడు కాళిదాసు. అతనెవరో తెలీదు. అతన్తో, కృష్ణ అంత చనువుగా ఉంటోందీ అంటే దగ్గరవాడై ఉండాలి. బంధువైతే ఈ చీకట్లో సరసాలెందుకు?

అతను కృష్ణ భుజాల చుట్టూ చేతులు బిగించాడు. కృష్ణ దాదాపు అతని ఒళ్ళో కూర్చున్నట్టుగా కూర్చుంది. వాళ్ళిద్దరూ సినిమా చూడ్డంలేదని కాళిదాసు గ్రహించాడు. కారణం కాళిదాసూ సినిమా చూడ్డం లేదు వాళ్ళని చూస్తున్నాడు. కృష్ణని అతనికి దగ్గరగా అలా చూస్తోంటే కాళిదాసు ప్రాణం గిలగిల్లాడిపోయింది. తన వస్తువుని ఎవరో దుర్మార్గంగా లాక్కుపోయినట్టు ఫీలయాడు.



కాళిదాసు సినిమా చూడంలేదు, వాళ్ళిద్దర్నీ చూస్తున్నాడు. వాళ్ళిద్దర్నీ కూడా మనసారా చూడలేకపోతున్నాడు. కృష్ణ పక్కన అతని చేష్టల్ని చూడలేక కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. కృష్ణ ఏమీ అనదేః ఆమె కిష్టమేనాః నో నో కాదు.

సినిమా అయిపోయింతర్వాత హాల్లోంచి బయటికి వస్తుండగా చూశాడు. కృష్ణ బ్లౌజ్ వెనక హుక్స్ ఊడిపోయి వున్నాయి. అటూ, ఇటూ చూసి అతను సరిజేయబోయాడు. కృష్ణ పమిట కొంగుని భుజాల చుట్టూ తిప్పి కప్పుకొంది. సినిమా హాలయిపోయిందిగానీ లేకపోతే ఆ రోజు బీచిలో లాగే.... కాళిదాసు మనసు కోపంతో భగ్గున మండింది.

అతన్ని పీక పిసికి చంపెయ్యాలనుకున్నాడు. పృథ్వీరాజులాగా కృష్ణని ఎత్తుకు పారిపోవాలనిపించింది. హాలు బయట వెలుగులో అతన్ని చూశాడు కాళిదాసు. బెల్ బాటమ్, బెల్ షర్టు వేసుకున్నాడు. ఎర్రగా,అందంగా ఉన్నాడు. అసహనంగా పళ్ళు పటపట కొరికాడు కాళిదాసు. గబగబ అడుగులు ముందుకి వేశాడు. అతని పక్కగా నడిచాడు. అతను కృష్ణతో కలిసి మెట్లు దిగబోతున్నాడు. కాలు ముందుకి జరిపి తను పక్కకి తప్పుకున్నాడు కాళిదాసు. అతను దొర్లుకుంటూ మెట్లమీంచి కింద పడడానికి నిమిషంకూడా పట్టలేదు, తలచిట్లి రక్తం కారుతోంది.

అక్కసుగా చూసి ముందుకి వెళ్ళబోతూ పక్కకి తిరిగాడు. అప్పుడు చూశాడు. కృష్ణ తనకేసి చూడ్డం. ఆ చూపులకి శక్తి ఉంటే ఏమైపోయేవాడో తనుః"

## 4

పది రోజుల తర్వాత తిరిగి కాలేజీలో అడుగుపెట్టాడు కాళిదాసు. అంతా కొత్తగా కనిపించింది. అందరూ తనకేసి వింతగా చూస్తున్నట్టుగా ఫీలయ్యాడు. దూరంగా చెట్ల కింద లాబ్స్ దగ్గర కనిపించింది కృష్ణ.

కృష్ణకి లాబ్స్ దగ్గరేం పనిః పైగా చీకటిపడుతోంది.

కాళిదాసు కృష్ణదాకా చేరక ముందే కెమిస్ట్రీ లెక్చరర్ గంగాధర్ లాబ్‌లోంచి కృష్ణదగ్గరకి రావడం చూశాడు కాళిదాసు. అతను కృష్ణ దగ్గరగా వచ్చి చెయ్యి అందుకున్నాడు.

కాళిదాసు ఉలిక్కిపడ్డాడు. కోపంతో కళ్ళెర్రబడ్డాయి. వాళ్ళిద్దరూ చెట్టుకింద కూర్చున్నారు. అతను ఏదో చెబుతున్నాడు. కృష్ణ శ్రద్ధగా వింటూ అప్పుడప్పుడూ నవ్వుతోంది ఆలోచించుకుని.

తెలియని పాఠాలు చెప్పించుకుంటోందాః"


పట్టు చీరలకు పుట్టినిల్లు
పలు రకాల చీరలతో వెలసిన
వనిత శారీ సెంటర్
కొత్తగూడెంకు
దయచేయండి.



ఉప్పొంగి పొంగే శక్తి!




పెరిగే పాపకు ఎంతసేపో, ఎంతెంతసేపో ఆడుకునే శక్తి ఉంది. ఆశక్తి యొక్క రహస్యం ఏమిటో తెలుసా? ఏమంటే ఆరోగ్యాన్ని పెంపొందిస్తూ అన్ని వయసుల వారికి తగిన పోషణనిచ్చే టానిక్ అల్బో-సాంగ్. దీనిలో ఉన్న ఖనిజాలతోనూ, మూలికల సారంతోనూ ఆహారానికి అనుబంధంగా పనిచేస్తుంది.

అల్బో-సాంగ్®
జీర్ణశక్తిని, శక్తిని పెంపొందిస్తుంది.
కుటుంబానికంతటికోసం ఎకానమీ ప్యాక్ కావాలని మీడీలర్ని అడగండి

జె. అండ్ జె. డిషేన్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్-500 001
డిపోలు: బొంబాయి. ఢిల్లీ. కాన్పూర్

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!

హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్ల నష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మ వ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును.
వరిబీజము (బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండా రండి.
డా॥ దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడి వద్ద, తెనాలి.
బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.

SEALED PACKING … TABLETS
AVAILABLE AT ALL CHEMISTS
Mfrs: SEENU & CO., MADRAS-21

తెల్ల మచ్చలు
మా స్వస్తికా బూటి తెల్లమచ్చ రంగు సమూలంగా త్వరితగతిని మామూలుగా మార్చును. 2 నెలలకు ఒక సీసా ఉచితంగా ఇవ్వబడును.
తెల్ల వెంట్రుకలుండవు
పొగడడం మాకు ఇష్టంలేదు. కాని మా 'కేష్‌రంజన్' ఆయుర్వేదిక్ సెంటెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగా మార్చును. మొదట తెల్ల వెంట్రుకలను నల్లవిగా మార్చి అటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపు వృద్ధి పరచును. లాభం పొందినవారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు. లాభం లేకున్న డబ్బు వాపసు. ధర రు. 12/-.
SHYAM AYURVED BHAVAN
(S-5)
P.o. Katri Sarai (Gaya)

(ఛ-అతను కెమిస్ట్రీ లెక్చరరు! కృష్ణ బి. ఏ.)

"మరైతే...?"

(ఇంకా చూస్తావేం తెలియడంలా?)

అప్పుడు చూశాడు కాళిదాసు అతను కృష్ణ చేతిని అందుకుని ముద్దు పెట్టుకోడం.

కాళిదాసుకి గుండెనెవరో చేత్తో పిండుతున్నట్టుగా ఉంది. తనది కావలిసిన కృష్ణతో మరొకడు తిరగడమా? తనకి దక్కవల్సినవన్నీ మరొకడు సొంతం చేసుకోడమూ ఆవేశంగా ముందుకు వెళ్ళబోయి. అంతలో ఆగి గబగబా వెనక్కి తిరిగి కాలేజీ బయటకొచ్చాడు కాళిదాసు.

"ఎక్కడికా పరుగు? ఏం చేస్తావ్?"

(చూడు ఏం చేస్తానో)

కెమిస్ట్రీ లెక్చరర్ గంగాధర్ ఇంటిముందాగి తలుపు తట్టాడు కాళిదాసు. గంగాధర్ భార్య తలుపు తీసింది. ఆమెని తోసుకుని లోపలికి అడుగుపెట్టాడు కాళిదాసు. ఆ గదిలో ఎవరూ లేరు. లోపల ఎవరివో మాటలు, రేడియోలో పాటలు, పిల్లల అరుపులు వినబడుతున్నై. చటుక్కున ముందుకివెళ్ళి ఆమెని గట్టిగా పట్టుకున్నాడు కాళిదాసు. ఆమె బిత్తరపోయింది. పెనుగులాడింది. అరవబోయింది. అరవనియ్యలేదు కాళిదాసు. ఆమె నలాగే పట్టుకుని చేతుల్తో నలిపేస్తూ పెదాలపైన గట్టిగా ముద్దు పెట్టుకుని గాటు పడేలా కొరికేడు. ఆ తర్వాత అన్నాడు:

"అరవకు నీకే నష్టం. నీ మొగుడ్ని మరో ఆడపిల్ల జోలికి రాకుండా చూసుకో లేకపోతే ఇప్పుడిచ్చిన దానికంటె కఠినమైన బహుమానం నీ కిస్తాను."

వెంటనే ఆ ఇంటిని వదిలి బయటికొచ్చేశాడు కాళిదాసు. తిన్నగా రూం చేరుకుని సూట్‌కేస్‌లోంచి విస్కీ బాటిల్ తీసి గడగడా తాగేశాడు. మండే అతని గుండెలకి విస్కీ మరింత ఆజ్యం పోసింది. సెగలు గక్కుతుండగా వెళ్ళి మంచంపైన వాలిపోయేడు. ఒళ్ళు తేలిపోతోంది. కళ్ళు నిప్పులు కురుస్తున్నట్టు మంటలుగా ఉన్నాయి. అశాంతిగా గుండెని చేత్తో రాసుకుంటూ మంచంపైన అటూ, ఇటూ దొర్లేడు. అతన్లో కసి, ఏదో చెయ్యాలన్న తపన, దేన్నో పొందాలన్న ఆరాటం ఒక్కసారిగా పెల్లుబికినై. విసురుగా బయటికి నడిచాడు.

## 5

"ఏమిటాలోచిస్తున్నావ్?"

(తెలీదు)

"అయితే కృష్ణని మర్చిపోతావా?"

(నో ఈ కంఠంలో ప్రాణం వుండగా మర్చిపోను)

మరి నీ రియాక్షన్ ఏమిటి?

(సక్సేనా అంతు చూస్తాను)

"సక్సేనా కృష్ణని పెళ్ళి చేసుకుంటానంటే?"

(సముద్రంలో దూకుతాను)

సక్సేనా తలుపు తోసుకుని గదిలోకొచ్చేడు. అతని షర్టు నలిగిపోయింది. ముఖం వాడిపోయి ఉంది. మనిషి అలసిపోయినట్లుగా ఉన్నాడు.

కాళిదాసు చూసేడు.

"సక్సేనా నీతో మాట్లాడాలి కూర్చో" అన్నాడు. మనసులో రగిలేపగ, ద్వేషం మాటల్లో తనబడకుండా జాగ్రత్త పడ్డాడు కాళిదాసు.

సక్సేనా నవ్వేడు.

"ఏమిటి కొత్తగా వుంది ధోరణి? అర్జంటా?" అడిగేడు.

"అవును"

"సరే. త్వరగా ఒక్కముక్కలో చెప్పు." కుర్చీలో కూర్చుని బూట్లు విప్పుతూ అన్నాడు సక్సేనా.

"కృష్ణజ్యోతి ఎలా తెలుసు నీకు?" అడిగేడు కాళిదాసు.

సక్సేనా తలెత్తి కాళిదాసు మొహంలోకి చూసేడు. కాళిదాసు ఎప్పుడూ లేనంత భయంకరంగా కనిపించేడు.

సక్సేనా నవ్వేడు మళ్ళీ.

"ఎలా తెలుసని కాదు తెలుసా అనడుగు- తెలుసని సమాధానం చెప్తాను. ఏం మనసుగా ఉందేవిటి?" అడిగేడు సక్సేనా.

"పిచ్చిగా మాట్లాడకు. కృష్ణని నువ్వు ప్రేమించావా?"

"లేదు."

"స్నేహితురాలా?"

"అసలు కాదు. అయినా ఇవన్నీ ఎందుకడుగుతున్నావ్. కృష్ణగానీ నిన్ను ప్రేమించిందా?"

"తెలీదు"

"మరి కృష్ణతో మూవ్ అవడంలో నీ వుద్దేశం?

"నథింగ్-ఆవిడ ఫ్రీగా వుంటుంది. నాకు అలా వుండేవాళ్ళంటే సరదా. కాదనడానికి నేనేం మహర్షిని కాదు మగాడ్ని."

కాళిదాసు సమాధానం చెప్పలేదు. సక్సేనా మళ్ళీ డ్రెస్ చేసుకుని బయటికి వెళ్ళిపోయాడు. అలా వెళ్ళినవాడు తిరిగి రాత్రికి పదింటికి గదికి చేరుకుని వెంటనే ముసుగుతన్ని నిద్రలోకి జారిపోయేడు.

కాళిదాసులో అణువణువూ పగతో, ద్వేషంతో తిరగబడుతోంది. అమాయకమైన ఆడపిల్లల జోలికొచ్చి వంచించి నాశనం చేసే ఇలాంటి కిరాతకుల్ని బ్రతకనీయకూడదు.

నిద్రపోతున్న సక్సేనాకేసి చూశాడు. ఇంతకు ముందెప్పుడూ కనబడని వికృత రూపం సక్సేనాలో కనబడింది.

కృష్ణ అమాయకురాలు. దాన్ని అలుసుగా తీసుకొని ప్రతివాడు ఆమెతో ఆటలాడుకోవాలని చూస్తున్నాడు. సంఘంలో ఇటువంటి చీడపురుగు లున్నంతకాలం ఆడపిల్లలకి రక్షణ ఉండదు. అందర్నీ కాకపోయినా కనీసం ఒక్కడినైనా ఈ లోకం నుంచి తప్పించగలిగితే మిగతా వాళ్ళకి బుద్ధొస్తుంది. చివాలున లేచి కూర్చున్నాడు కాశీదాసు. తాళపుచెవి గుత్తిలోంచి సన్నని పదునైన కత్తిని బయటికి తీశాడు. నిద్రపోతున్న సక్సేనా దగ్గరగా నడిచాడు. ప్రశాంతంగా నిద్రపోతున్న సక్సేనా



daCunha/CS/24b/Tel.

గుండెల్లో కాళిదాసు చేతిలోని కత్తి మరో క్షణంలో దిగబడేదే.

కానీ కాళిదాసు ఆ పని చెయ్యబోయే ముందు ఒక్క క్షణం ఆలోచించాడు. సక్సేనా తన స్నేహితుడు రూమ్మేటు. తనీ రోజున ఇలా బ్రతక గలుగుతున్నాడంటే దానికి కారణం సక్సేనా. లోకంఅంతా తన రూపాన్ని చూసి చీదరించుకుని దూరంగా వున్నా, ఆత్మీయంగా దగ్గరకి చేరి పలకరించి ఆశ్రయం ఇచ్చాడు సక్సేనా. ఈ ప్రపంచంలో తన మీద ప్రేమ, అనురాగం వున్న ఒకే ఒక్క మనిషి సక్సేనా.

చేతిలో కత్తిని మూసేసేడు కాళిదాసు. సక్సేనా పక్కనే చోటు చేసుకుని పడుకున్నాడు.

## 6

దూరంగా చెట్లకింద క్రోటన్స్ మొక్కల పక్కగా నుంచుని ఫ్రెండ్స్‌తో మాట్లాడుతోంది. కృష్ణ, కాళిదాసుని చూసింది. ఆ చూపులో ఏదో తీవ్రత.

కాళిదాసు ఒళ్ళు జలదరించింది. కృష్ణ తనకేసి నడుస్తూ వస్తోంది!

కాళిదాసు గుండె వేగంగా కొట్టుకోడం ప్రారంభించింది.

కృష్ణ తనని గుర్తుపట్టింది! తనకోసం తనదగ్గరకి వస్తోంది. ఇన్నాళ్ళూ తను చెయ్యలేని ధైర్యం కృష్ణ చేస్తోంది.

కృష్ణజ్యోతి కాళిదాసుదగ్గరగా వచ్చింది.

కాళిదాసు తడబడ్డాడు. సిగ్గో, భయమో, సంకోచమో తెలీలేదు.

కృష్ణ కాళిదాసును చూసి నవ్వింది!

కాళిదాసూ నవ్వేడు. అలా నవ్వగలనని కాళిదాసు ఇంతకుముందు అనుకోలేదు.

"కాళిదాసుగారూ...." కృష్ణజ్యోతి పిలిచింది.

కృష్ణకి తన పేరు తెలుసన్నమాట. కృష్ణకూడా తనని ప్రేమిస్తోంది. చాటుగా




"దీపజ్యోతి"

చిత్రం : వి. యస్. రావు, తెనాలి

తన గురించి అంతా తెలుసుకుంటోందన్న మాట.

"మీతో కొంచెం మాట్లాడాలి" అంది కృష్ణ.

అతను మాట్లాడలేకపోయేడు.

"మీకు వీలైతే సాయంత్రం ఒకసారి బీచ్‌కి రండి."

కాళిదాసు హృదయం పొంగిపోయిందా మాటతో. కృష్ణని చూస్తూ మూగగా ఉండిపోయాడు.

"మీకు అభ్యంతరం లేకపోతేనే" చిన్నగా నవ్వుతూ అంది కృష్ణజ్యోతి.

"తప్పకుండా. తప్పకుండా వస్తాను" గభాల్న అనేశాడు కాళిదాసు.

"థాంక్స్"

కృష్ణజ్యోతి వెళ్ళిపోయింది.

ఆకాశమంత ఆశని కృష్ణపై నిలుపుకుని ఆమెకోసం ఎదురుచూస్తూ బీచిలో కూర్చున్నాడు కాళిదాసు. దూరంగా కృష్ణ రావడం చూశాడు. అతని హృదయం ఆనందంతో సముద్రంలా పరవళ్ళు తొక్కింది. కృష్ణని దగ్గరకి తీసుకునే క్షణంకోసం అతని చేతులు తొందరపడుతున్నాయి. ఆమె ఒళ్ళో తలపెట్టుకుని ఆమె కళ్ళలోకి చూస్తూ పడుకోవాలని మనసు ఆరాటపడుతోంది.

కృష్ణ కాళిదాసు దగ్గరగా వచ్చి పక్కనే ఇసుకలో కూర్చుంది.

"ఎందుకు పిలిచారు?" అడిగాడు కాళిదాసు.

"నేనంటే మీకు అభిమానమా?" అడిగింది.

కాళిదాసు ఆ మాటలకి మాట్లాడలేకపోయాడు.

కృష్ణ బాధగా నవ్వి అంది.

"నాకు తెలుసు మీరు నన్ను వెంటాడుతున్నారు. ఏదో చెప్పాలని చెప్పలేకపోతున్నారు. అవునా?"

కాళిదాసు తలెత్తి చూశాడు.

"అవును" అనగలిగాడు.

కృష్ణ తేలికగా నవ్వింది.

"ఈ మాత్రం దానికి ఇంత రభస దేనికి?"

"అంటే?" అన్నాడు.

"నాకు మనుషుల అందాలతో, మనసులతో పనిలేదు. నాక్కావల్సింది నా అవసరాలు తీరడం. నా కళ్ళకి అందగాడూ, కురూపీ అన్న తేడాలేదు. అందరూ ఒకేలా కనబడతారు. కారణం నాకు నా అనేవాళ్ళెవ్వరూ లేరు. చెప్పాలంటే అనాధని. నేను బతకాలి. చదువుకోవాలి, ఉద్యోగం సంపాదించాలి. అందుకే మీకు చేతులు జోడించి అడుగుతున్నాను. నా దారికి అడ్డు రాకండి. నా కోసం నా చుట్టూ తిరిగే వాళ్ళని బెదిరించీ, భయపెట్టీ తరిమి కొట్టకండి. కేవలం ఈ అందాన్నే ఆస్తిగా పెట్టుకొని బతుకుతున్నాను."

వెక్కి వెక్కి ఏడుస్తోంది కృష్ణజ్యోతి.

కాళిదాసు ముఖం కందగడ్డలా అయింది. కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి. పెదవులు ఉద్వేగంగా అదురుతున్నాయి.

కాళిదాసు లేచి నించున్నాడు.

జుగుప్సగా చూశాడు కృష్ణజ్యోతిని.

"ఈ దౌర్భాగ్యపు బతుకు బతికేకంటే సముద్రంలో పడి చావరాదూ ? అన్నాడు.

అతని మాటలు కృష్ణజ్యోతిలో ఏ విధమైన ప్రభావాన్ని కలిగించాయో కాళిదాసుకి తెలీదు. అక్కడో క్షణం కూడా నించోవాలనిపించలేదు. విసవిస ముందుకి నడుస్తూ ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాడు.

కృష్ణజ్యోతి మోకాళ్ళమధ్య తలపెట్టుకొని ఏడుస్తోంది.

కసిగా సముద్రంకేసిచూశాడు కాళిదాసు.

విశాలమైన సముద్రం ఎంతటి పాపాన్నైనా తనలో ఇముడ్చుకోడానికి సిద్ధంగా ఉన్నట్టు కనబడింది కాళిదాసుకి. అప్పటి వరకూ పెంచుకొన్న ఆకాశమంత ఆశనీ సముద్రంలో కలిపేసి కాళిదాసు ముందుకి నడిచాడు.

★

ఉచితము! ఉచితము!

తెల్ల మచ్చలు

మా చికిత్స ప్రారంభించగానే మచ్చల రంగులో మార్పు వస్తుంది. పరీక్షించి మా మందు ఎంత పని చేస్తుందో చూడండి. రోగి వివరాలు వ్రాసి ఉచితంగా ఒక పాకెట్ మందు పొందండి.

LALIT AYURVEDIC
PHARMACY (AJ)
P. o. Katri sarai (GAYA)